నీటి  చుక్క

శ్రీ మంథా వెంకటరమణరావు

ఔను. ఆమెవి అరమోడ్పుకన్నులు. ఆశ ఆ రెప్పల ప్రతి వంపులోనూ ప్రతిబింబిస్తోంది. నిరీక్షణ ఆమె కాటుకకన్నుల అంచులమీద చిందులాడుతోంది. దేనికోసమో వెతుకసాగాయా కళ్లు.

దూరంగా చూస్తున్నాయవి. ఎంతదూరం? ఏమో? ఆ కొండలుదాటి ఇంకా దూరంగా–కాదు ఇంకా దూరదృష్టుందా కళ్ళకి—ఆ కొండలు దాటాకా బయలు ప్రదేశం. తిరుగకొండలు, సెలయేళ్ళు, నదులు, సముద్రాలు, ఎడారులు ఇంకా ఎన్నెన్నో వాటి నన్నిటినీ చూస్తున్నాయో యేమొ!

అస్తమిస్తున్న సూర్యుడికాంతి ఆమె కనుకొలకులలో ప్రతిబింబించింది. ఎంత ఓర్మి ఆ కళ్లకి. జేగురుపూసుకున్నట్టున్నాయా రెప్పలు—ఔను—భూమిలోకి పాకుకుపోయే ఎఱ్ఱటిబింబం వాటి దృష్టి నాకర్షించింది. ఎఱ్ఱదనంలో అంత అందముందా? ఎఱ్ఱగా ఉండేవంటని చూస్తే భయమేస్తుందే! కాగపోసిన ఇనుములా ఉండే ఆ బింబం ఆ కళ్ళ నెందుకాకర్షిస్తోంది? ఆ బింబంలో దూగుదామని ఉందేమొ వాటికి—దూరితే కాలిపోవూ? అది నిప్పుచింతని మేష్టారు చెప్పారే. దానికన్న ఎఱ్ఱగా ఉన్నట్టున్నాయా కళ్ళు—కాలకపోవచ్చు. అంత శ్రమపడి అక్కడికి వెళ్లటంలో వాటి ఉద్దేశం? ప్రపంచాన్నంతా ఒక్కసారిగా కలియచూదామని ఆశేమొ. ఎంత ఆశ వాటికి! ఆశించడంలో తప్పేముంది? ఎంతమందలా ఆశించటంలేదు అసాధ్యమైన వాటి కోసం?

ఆ రెప్పలు కలసుగొన్నాయి ఒక్కక్షణం—ఊహించుకొని తృప్తిపడుతున్నాయవి—పాపం! ఏంచేస్తాయి? అలాటి కోరికలు కోరుకుంటే ఎక్కడన్నా ఫలిస్తాయా?

రెప్పలువిడ్డాయి. మునుపటిలాలేవు. ఏదో మార్పొచ్చింది వాటిలో—సూర్యుడి ఒక ఎఱ్ఱటి కిరణం ఆమె కుడికను కొలకులో మెరసే నీటిచుక్కలోకి దూసుకుపోతోంది. మణిలా మెరసిపోతోందా చుక్క. రెండో కన్ను చెమ్మగిలింది. అంతే. వింతగా ఉంది!

బింబం పూర్తిగా పాతుకపోయింది.

ఒక నిట్టూర్పు విడిచి బరువైన శరీరాన్ని తిప్పిందామె. తలలో నెరసిన వెంట్రుకలు వెండి తీవల్లా మెరుస్తున్నాయి—కాని అమ్మకన్నా చిన్నగా కన్పిస్తోంది. అమ్మకన్నా ఎవరైనా చిన్నంటే నాకు చిన్నతనం. నే నొప్పుగోను.

తన్ను పరీక్షగా చూస్తున్న నన్ను చూసి చిరునవ్వు నవ్వింది. రమ్మని చేసౌజ్ఞచేసింది. నాకాశ్చర్యం వేసింది. ఆవిడతో అంతగా నే నెప్పుడూ మాట్లాడలేదే. ఒకసారి కామోసువీధిలోకి ఐస్ క్రీమ్ తెస్తే కొని వీధిలో ఆడుకొంటున్న పిల్లలందరికీ పంచింది—ఆ గుంపులో నేనున్నాను. నా కందిస్తూ బుగ్గమీద మెల్లగా కొట్టి ముద్దుపెట్టుగుంది. నాకు చాలా సిగ్గేసింది—మరోసారి బడినుండొస్తూఉంటే పిలచింది. నా పేరడిగింది. కొత్తవాళ్ళకి నా పేరు చెప్పడం నాకిష్టంలేదు. ఐనా నాకోసారి ఐస్ క్రీమ్ ఇచ్చింది కాబట్టి తప్పదన్నట్టు నసుగుతూ చెప్పేను. చెయ్యిపట్టుకుని ఇంట్లోకి తీసుకెళ్ళింది. చాలా బాగుందా ఇల్లు. ఎదురుగా ఉన్న ఆ ఇంటిని అన్నిళ్లూ చూసినట్టు

చూశాను. కాని లోపల అంత అందంగా ఉంటుందని ఎప్పుడూ అనుకోలేదు. మెరుస్తున్న కఱ్ఱటేబిలు ముందు కుర్చీలో కూర్చోబెట్టింది. ఆవిడేమీ మాటాడలేదు కాని నోరూరేటట్టు తియ్యతియ్యని సామానులన్నీ తెచ్చుంచిందొక పనిమనిషి. "తిను. నీ కోసమే"—అందావిడ. నాకు సిగ్గు, సిగ్గు తెప్పించినందుకు కోపమూ, వచ్చేయి. ముఖం ఎఱ్ఱ చేసుకొని మౌనంగా కూర్చున్నాను. "అలా అయితే నే నాకు కోపమొస్తుంది" అంటూ నా అనుమతి లేకుండా నే ప్లేటునుంచి-ఒకటి ఏమిటో తెలీదు-తీసి నానోటి కందించింది. ఉమ్మేద్దామనుకున్నాను. కాని నా నాలుక ఆ పని చేయనీయలేదు. చాలా రుచిగా ఉందా పదార్థం. మంచులా నోట్లో కరగిపోయింది. అలాటివి అమ్మ తన జన్మలో చేసిందా అనిపించింది-సిగ్గు పడుతూ నే ప్లేట్లన్నీ ఖాళీచేసేను. వీలున్నప్పుడల్లా నన్ను రమ్మని రోడ్డువరకు దిగబెట్టింది. ఆ రాత్రి అమ్మతో సంగతి చెప్పేను. ఎందుకో మా అమ్మ ముఖాన నెత్తురు లేకుండాపోయింది. "రామం రేపట్నించీ ఈ ఇంట్లో భోంచెయ్యకు" అంది. పెద్ద రాయి పడ్డట్టయింది. "ఏమమ్మా?" అన్నాను. "ఇంకో ప్రశ్న వెయ్యకు. ఈ ఇంటికీ నీకూ సంమ్మంధం లేదు" అంది. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "నే నేం తప్పు చేశానే" అన్నాను. మరి మాటాడలేదమ్మ. కోపం తగ్గాక మర్నాడుదయం అంది. "రెండోఫారం చదువుతున్నా నీకు లోకజ్ఞానం సున్నా. నీతో ఎలా ఏడవడమో నాకు తెలియకుండా ఉంది. నువ్వు చేసిన పనేమిటో తెలుసా. పోనీ నన్నడగొద్దూ. ఆ ముండకైనా బుద్ధుండొద్దూ-తల్లిదండ్రులకు తెలియకుండా పిల్లల్నిలాగేనా పాడు చెయ్యటం?"—నాకేమీ అర్థం కాలేదు. "ఏమే అమ్మా ఎందుకలా ఆవిణ్ణి తిడతావే?" అన్నాను. దానికి జబాబుగా నా వీపుమీద గట్టిగా ఆవిడచేతులు పడ్డాయి. "వెధవా దాని మాయల్లో పడ్డావూ. నే నెలా చచ్చేది. తల్లినీ పిల్లనీ ఇలాగేనా వేరు చెయడం? ఆ రంకులాడికి జ్ఞానముండొద్దూ ఇలాగే మెల్లిగా మాయలుపన్ని దానివేపు లాక్కోవడం" అంటూ పెంకు లెగిరేటట్టు నోరుపెట్టింది. మరో ప్రశ్న వెయ్యడానికి నా ఒళ్లు ఒప్పుగోలేదు.

అది అంతకుముందు జరిగిన విషయం.

నా మౌనం చూసి మరోసారి సౌంజ్ఞ చేసిందామె రమ్మన్నట్టుగా. నేను సందిగ్ధంలో పడ్డాను.

పాపం రెండుసార్లు చెయ్యూపింది రమ్మని. నాతో ఏదో ముఖ్యమైన పనుండకపోతే ఎందుకు రమ్మంటుంది? నే వెళ్లకపోవడం వల్లఆమె కేమునా నష్టం కలుగుతుందేమొ. అలా బ్రతిమాలుతూ ఉంటే వెళ్ళకపోడం బాగుంటుందా. ఆవిడ ఏడుపు జ్ఞాపకమొచ్చింది. పాపం. ఏడ్చింది సూర్యణ్ణి చూస్తూ. ఉత్తినే ఏడుస్తుందా - ఎందుకేడ్చిందో మామాస్టారు కొడితే నే నేడుస్తాను. అంత పెద్దావిణ్ణెవరన్నా కొడతారా? కొడితే కొట్టొచ్చు - నాన్నకెప్పుడన్నా కోపమొస్తే అమ్మని......నాకే బలముంటే నాన్నని గిరగిర తిప్పి గాల్లో ఎగరేసుండేవాణ్ణి. నాన్నలాటి వాళ్లెవరూ ఆవిడింట్లో లేరే. స్నేహితులు ఒచ్చిపోతూంటారు. అందరూనవ్వుతూ ఆమెతో మటాడతారు. కొత్త కొత్త వాళ్ళొచ్చి నమస్కారాలు పెడుతూ ఉంటారు. వాళ్లెప్పుడన్నా...? ఛా! ఛా! మరి? వెళితే బాగుణ్ణు. ఆవిడ మంచిదికాదని అమ్మంది రెణ్ణెల్ల కింద. ఏవేవో తిట్టింది. మంచావిడ కాపోతే రోజూ ఎందుకలా ఏడుస్తుంది మరి? అమ్మెప్పుడూ అబద్ధం చెప్పదే. అయినా ఆవిడదగ్గరకెళ్తే బాగుణ్ణు!

ఇంకా చూస్తోందామె. వెళ్ళాలని నాకు బుద్ధి పుట్టింది. కాని అమ్మజ్ఞాపక మొచ్చింది.

అమ్మకి తెలిస్తే ప్రాణాలు తీసేదూ - రోజూ నేను స్కూలుకి వెళ్లినపుడూ, వచ్చినపుడూ బయట నిల్చుంటుందే.

నిశ్చయించేను వెళ్ళకూడదని. రానన్నట్టుగా తలూపేను. ఒక్క అరనిముషం తీక్షణంగా చూసిందామె నాకళ్ళలోకి. నా ఒళ్ళంతా వణికింది. మంచావిడకాదేమో అనిపించింది. కాక నే ఒస్తానని అలా చూస్తోందేమో. మరోమాటు తలూపాను అసమ్మతిసూచకంగా. నన్ను చూసి వింతగానవ్వి లోనికి పోయింది. నాపిరికితనాన్ని చూసి నవ్విందేమో అనిపించింది. నాకు అవమానంగా తోచింది.

నన్ను పిరికిపంద కిందకట్టిందేం, నా సంగతి తెలీదు కామోసు. ఐతే మరి పిలిచేసరికి ఎందుకు వెళ్ళలేదు? అమ్మ......అమ్మదగ్గర భయం లేకపోతే ఎలా? ఎవరిదగ్గరన్నా బాధలేదు కాని—ఎలా

నవ్వింది నన్ను చూసి. ఛీ! ఎవరో పై ఆడది నన్ను చూసి నవ్వడమా—పై ఆడదా ? ఒక్కసారి ఐస్‌క్రీమిచ్చింది. మరోసారి మిఠాయిచ్చింది. మంచి కబుర్లు చెప్పింది—పై ఆడ దెలాగయింది ?

వీనికంతకీ కారణం అమ్మ అని నిర్ధారణపరచుకున్నాను. అమ్మవెళ్ళనీపోవడంవల్లే ఆ అవమానం నాకు జరిగిందనిపించింది.

ఆరాత్రి అమ్మని సమీపించేను. కంచాలు కడుగుతోంది. "అమ్మా" అన్నాను. వెనక్కి తిరిగి చూసింది ప్రశ్నార్థకంగా. "నీకు కోపం రాకపోతే" అని నసిగాను. "ఏమిట్రా" అంది విసుగ్గా. జంకు వేసింది. కాని బరువోదుల్చుకొన్నాను. "మరే. ఆవిడెందుకు మంచిదికాదమ్మా" అని! "ఎవర్తా" అంది ఆశ్చర్యంగా నా ముఖంలోకి చూస్తూ—"ఆవిడే నే. ఆ వేళ నాకు మిఠాయిచ్చింది". వింతగా చూసింది నా వేపు. "నీకు మతికాని పోతోందేమిట్రా ? అదేదో మందు పెట్టినట్టుంది. ఇన్నాళ్లూ లేనిది ఇవాళ దానూసెందుకొచ్చింది ?" రాబోతున్నది తెలిసింది. కాని ధైర్యంచేసేను. "రోజూ సాయంకాలం ఎందుకో ఏడుస్తుందే. మంచిది కాపోతే ఏడుస్తుందే" అన్నాను. కోపంలో వ్యవధి లేకుండా అందమ్మ "తిన్నగా తిని కూర్చుండలేక, ఊళ్ళోఉన్న రంకుమొగుళ్ళు చాలక. ఎవడచ్చున్నాడో ఆస్థి. ఇట్లా ఒదిలిచచ్చేడు. ఇదిలా కులుకుతోంది. చచ్చేకాలమొచ్చినా...." ఆగిపోయిందొక్కసారి ముఖం ఎర్రది చేసుకుని తప్పుచేసిన దానిలా. "వింటంటున్నావే" అన్నాను. "వెళ్ళి పడుకో" అని కసిరింది. నాలో ధైర్యంపోయింది. అంతే ఆవిడసంగ తెప్పుడూ అమ్మదగ్గ రెత్తలేదు, మరి.

ఆ మరునాటి సాయంకాలం మాయింటి సావిట్లో నిలబడి చూశాను. రోజూలానే ఆ ఆవరణలో నిలబడి అస్తమిస్తున్న సూర్యుణ్ని చూస్తోందామె. కళ్లు మూసుగొని విప్పింది సంతృప్తిగా. కుడి కను కొలకులో నీటిచుక్క మణిలా మెరసింది. సూర్యు డస్తమించేడు. నిట్టూర్చి తిరిగిందామె. నన్ను చూసింది. రమ్మని సౌంజ్ఞచేస్తుందనుకున్నాను. విచారపు ఒక చిరునవ్వుతో చాలించిందామె. నా ఆశ్చర్యానికి మేరలేకపోయింది. ఎందుకు పిలవలేదివాళ, కోపంకానోస్తే నా వేపుచూసి నవ్వుతుందా? ఎంతబాధ ఇమిడుందా నవ్వులో. కళ్లెంత నీరసంగా ఉన్నాయి. నే వెళ్ళలేదని బాధపడుతోందేమొ. అమ్మ వెళ్లనివ్వటంలేదని తెలుసునేమొ—తెలిస్తైన వాళ్లకి చెప్పఖ్ఖర్లేకుండా నే తెలుస్తాయని విన్నాను. అమ్మమీద కోప మొచ్చిఉంటుంది. కానీ—రావాలి. నన్ను వెళ్ళనిస్తే ఏంపోయింది అమ్మకి, ఆవిడలా ఏడుస్తూఉంటే? అమ్మది జాలిగుండె కాదు. నానొక్కసారి రక్తాలొచ్చేటట్టు నన్ను కొడుతూ ఉంటే ఒద్దనన్నా చెప్పిందికాదు. నాన్నదగ్గర భయమేమొ. అయుంటుంది, అందుకే నన్ను వెళ్ళనివ్వటంలేదు. నాన్న దీనికంతకీ కారణం.

నాన్నమీద కోప మొచ్చింది నాకు.

ఆవిడంటే నాన్న కెందుకు ఇష్టంలేదు ? ఆవిడింటికి రానివ్వ లేదేమొ. మంచిబట్టలు వేసుకొని అంతా వెళ్తూ ఉంటారు. నాన్నకి మంచిబట్టలు లేవు. అక్కడికి వెళ్ళడానికి అంతా మంచిబట్టలు వేసుకుంటారని ఆవిడమీద కోపం. మంచిబట్టలు వేసుకుంటే ఏంపోయింది. అలాటి బట్టల్లో ఎంతబాగుంటారు! అందుకే ఆవిడ బాగుంటుంది. అమ్మకన్న చిన్నావిడలాగుంటుంది. అన్ని మంచిబట్టలూ, అంత పెద్దిల్లూ, తినడానికి మంచి తీపివస్తువులూ ఉంటూఉంటే ఆవిడెందుకలా ఏడుస్తుందా అనిపించింది. పాపం. ఒక్కసారివెళ్తే, వెళ్లాలనిపించింది. వెళ్లి ఆవిడ ఏడుపుకి కారణం అడగాలనిపించింది. కాని అమ్మకి తెలీకండా ఎలా వెళ్ళడం. లాభంలేనిపని.

ఎర్రటి కాంతిపోయింది. చీకటిపడింది.

ఆవిడవస్తూ ఉండేది రోజూ ఆవరణలోకి. చూస్తూఉండేది సూర్యుణ్ని. నీటిచుక్క మెరుస్తూ ఉండేదామె కంటి కొలకులో. ఆమె విషాదపు నవ్వు నాకు దక్కేది. వెళ్లాలని బుద్ధిపుట్టేది నాకు. కాని. ఎలా ?

అకస్మాత్తుగా ఒకనాడు నాకు ఆశ్చర్యం, ఆశాభంగం ఆతృత కలిగాయి. ఆమె ఆవరణలోకి రావటం మానేసింది. అరమోడ్పు కన్నులు, కను కొలకులో నీటిచుక్క, విషాదపు నవ్వు నాకు లేకపోయాయి. ఆశతో కూడిన ఆ కన్నుల దృష్టి పడకుండా బింబం అంతరించిపోయింది. సమ్మెటపోటు

తగిలినట్టయింది నాగుండెకి, ఆమెరాక కాలకృత్యంగా మారిందనుకున్న నా భావనకి ఆదెబ్బ. ఆవిడ రాక ఒక తప్పిపోని నిజంగా ఏర్పడిందినాకు. అస్తమించే సూర్యుడు, ఆమె కొలకులోని నీటిచుక్క రెండే రెండు నిజాలు నాకు. ఒకనాడా దృశ్యం లేకపోతే నామనసింత కలవరపడుతుందని ఊహించనైనా లేదు నేను.

ఏమిటి కారణం? ఆమె రాకపోవడానికి? ఈ ప్రశ్న నన్ను ప్రతి నిముషం బాధించసాగింది. విరమించుకుందేమొ తన ఉద్యమం. చూసేటి అవసరం తీరిందేమొ. ఐతే నిన్నకూడ విచారంగావుంది. నేను వెళ్ళలేదని కోపమొచ్చిందేమొ అనిపించింది అయ్యుంటుంది. ఎన్నాళ్లనుంచో నన్ను రమ్మన్నట్టుగా నవ్వుతూన్నపుడు ఒక్కనాడన్నా ఆమె ఆశని తీర్చలేకపోయాను. కోపం తెచ్చుకోవటంలో ఆమెది తప్పేముంది? వెళ్ళి దీనికంతకీ కారణమేమిటో అడగాలనిపించింది. కోపం తెచ్చుగో వద్దని చెప్పాలి. దీనికంతకీ తప్పంతా అమ్మదే. కాదు నాన్నదే. ఇంతకీ వెళ్ళడమెలా? లాభంలేదు. సాకళ్లు చెమ్మగిల్లేయి. నేనేం చెయ్యగలను! నా చేతుల్లో ఏముంది?

రోజులు గడుస్తున్నాయి. ఒకటి, రెండు, మూడు. అలా వారం రోజులు గడిచాయి. సావిట్లో నిల్చొని ఎదురు చూసేవాణ్ణి ఆవరణలో ఆమెకోసం ప్రతిరోజు సాయంకాలాన్న. ఆమె జాడేలేదు. నిరాశ, ఆతృత ఎక్కువవ జొచ్చాయి నాలో రోజు రోజుకీ. వారం రోజు లయేసరికి నాలో సహనం తగ్గింది. ఆతృతపట్టలేకపోయాను. ఆమె రాకపోవడానికేదో తీవ్రమైన కారణం ఉండుండాలని తోచింది. ఎవరడ్డొచ్చినా సరే ఆమెను కలుసుగోవాలి. కొడుతుం దమ్మ—నాన్నకూడానూ, కొట్టనీ. వెళ్తాను. వెళ్లితీరుతాను. ఏమొచ్చిందో ఆమెకి. ఏం బాధపడుతుందో.

నిశ్చయించేను. కాని నిశ్చయానికి వచ్చిన రెండుదినాలవరకూ కావలసిన ధైర్యం చిక్కలేదు. ఆఖరికి తెగించేను.

కాలేబింబం కనుపించలేదు. జేగురురంగు. తరువాత చీకటి.

నాన్నింట్లోలేరు. అమ్మ పెరట్లో వంటచేసుకుంటోంది. చడిచెయ్యకుండా యిల్లు దాటేను. మా యిల్లు వదలటం ఆమె ఇంటావరణ చేరటం ఒకేసారి జరిగాయి. కుక్క మొరిగింది. కుక్కలంటే నాకు భయమే. కాని అరచేకుక్క కరవదంటారు. ఓ రెండుసార్లు అరచి ఊరుకుంటుందది. గదిలోని దీపపు కాంతి అద్దపుతలుపులలోంచి స్పష్టమౌతోంది.

"ఎవరది" అని లోనుండి స్త్రీకంఠం ప్రశ్నించింది. ఆమే ఐఉంటుందని నిశ్చయించుగున్నాను. ఆ కంఠం ప్రశ్నిస్తూ దగ్గరగా ఒచ్చింది. కాదు. ఈ రూపం లావుగా లేదు. ఆమె కాదు. నన్ను సమీపించిందా రూపం. నాకు పట్టరాని కోపమొచ్చింది. మొదటే ఒక ఆశాభంగం. వెళ్లీవెళ్లిగానే నవ్వుతూ ఆమె కానొస్తుం దనుకున్నాను. దగ్గరగా తీసుగొని బుగ్గలమీద వేళ్ళతో కొడుతూ మంచిమంచి కబుర్లు చల్లగా చెప్తుందనుకున్నాను. కాని ఎదురుగా ఆ రోజు మిఠాయి తెచ్చిన పనిమనిషొచ్చింది. చెడ్డ శకునం. ఇంతా తెగించి రావడం దీన్ని చూడ్డానికేనా అనిపించింది. అమ్మమాట వినకండా దెబ్బలు తినడానిక్కూడా సిద్ధపడొచ్చానే ఎవరూ అని ప్రశ్నిస్తూ ఎదురు రావడానికిదెవర్తె. ఏం చేస్తే చెయ్యనీ జబాబివ్వకూడదని నిశ్చయించుగున్నాను. దాని గొంతుక బొంగురుపోతేపోనీ. "ఎవరది" తిరుగ ప్రశ్నించింది. నేను మాటాడ్లేదు. "అడుగుతే జబాబు చెప్పకుండా ఎవరది" అంది గట్టిగా. నేను చలించలేదు. దగ్గరగా ముఖం పెట్టి పరిశీలనగా చూసింది. ఎంత సిగ్గులేదు. యజమానురాలి మర్యాదా తీసేస్తోంది. నేనయింది. సరిపోయింది. ఎవరన్నా కొత్తవాళ్లయితే? ముఖాన్ని పిడికిలితో గుద్దుదామనిపించింది. మరింత దగ్గరగా ముఖం తెచ్చిచూసింది. ముఖం తిప్పుగున్నాన్నేను. ఒక్క కేక వేసింది. "అమ్మా చిన్నబాబుగా రొచ్చారమ్మా" అని. కేక వేస్తూనే నా చేతిని పట్టుగొని చీపురునీడ్చినట్టు గొరగొరా లాక్కొని పోయిం దింట్లోకి. ఎంత సాహసం! నా ఒంటిమీద చెయ్యివెయ్యడానికి దానికున్న హక్కేమిటి? మనిషనుకుందా ఆటవస్తు వనుకుందా నన్ను. జెబ్బనొప్పిగా కూడా ఉంది. నా కెంతో అవమానం జరిగినట్టుగా బాధపడ్డాను. పోగాలమొస్తే ఎరికైనా అలాటి బుద్ధులే పుడతాయి. ఈ

నిముషం వీధిలోకి గెంటిం చేస్తాను ఆమెతో చెప్పి. ఏమిటనుకుందో కాని! "అమ్మా చిన్నబాబుగారొచ్చారమ్మా" అంది పెంకు లెగిరేటట్టు మరోసారి, దీపం వెలిగే గదిలోకి నన్ను లాక్కొని వెళ్తూ.

గది ప్రవేశించేసరికి నాకోపం హరించిపోయింది. ఆ గదిలోకి నేనెప్పుడూ వెళ్ళే అవకాశం కలగలేదు. అంత అందమైన గది నాజన్మలో చూడననిపించింది. అద్దాల్లా ఉన్నాయి గోడలు. నేలనుంచి మూడడుగుల ఎత్తున చుట్టూ పాలరాయి ఆ గోడలకి. గదినిండా మెత్తని తివాసీ. నాలుగు దిక్కులా నిలువుటద్దాలు. పెద్ద పెద్ద వార్నీసు బొమ్మలు. గోడలకీ, ద్వారాలకీ, కిటికీలకీ రంగురంగుల సిల్కుగుడ్డలు. ఎంత బాగుందా గది. అడుగులు మెల్లగా వేసుగుంటూ ప్రవేశించేను. నా మట్టికాళ్ళు పడి తివాసీ పాడవుతుందేమోనని భయం వేసింది. స్వర్గం లాగుంది. ఈ ఆలోచనల్లో పడి ఆమే మాటే మరిచాను. నా ఎదురుగా ఉన్న పెద్ద మంచాన్ని కూడా చూడలేదు. ఎంత పెద్ద మంచం! ఎలా మెరుస్తోంది! చుట్టూ తెల్లటి జల్లీగుడ్డ. బాగుంది. మా అమ్మ, నల్లులమంచం జ్ఞాపకమొచ్చాయి. ఎపుడూ నిద్రపట్టదని ఫిర్యాదే అమ్మ. ఆ పొట్టి, కుక్కి, నల్లులమంచంమీద ఎలా పడుతుంది? చిన్న మూలుగొకటి నా ఆలోచనల కంతరాయం కలిగించింది. మరోసారి వినవచ్చింది మూలుగు. ఈసారి నేను పరధ్యానంలో పడలేదు. ఆ మూలుగు ఆవిడదే. ఆ మంచంనుంచి వస్తోంది. వింతనిపించింది. ఆమెక్కాని జ్వరం రాలేదుకద! పనిమనిషి నా చెయ్యొదల్లేదు, గది చూస్తున్నంతసేపూ. రెండవసారి మూలుగు విన్నాక ఇందాకటిలాగే రెక్క పట్టుగొని మంచందగ్గరకు లాగుకపోయింది. "ఇదిగోనమ్మా— చిన్నబాబుగారు" అంటూ. ఎంత హక్కు అధికారం ఉన్నట్టు ప్రవర్తిస్తోంది. ఇంటికి పరుగెత్తి పారిపోతే నన్నడ్డుపెట్టేవాళ్లెవళ్ళనిపించింది. దానధికారం సంగతప్పుడు తేల్తుంది. మంచంమీదేదో చలనం కలిగింది. ఒక ఒళ్ళు కదలింది. వెంటనే పోల్చాను. ఆమెదే ఆ ఒళ్లు. మంచి వాసన వస్తోంది. కప్పుకున్న దుప్పటినుంచి. ఒకసారి నేను దొంగిలించితెచ్చిన ఆకు సంపెంగకు కూడ అంతవాసన లేదు. ముఖంపైనున్న కప్పు తొలగించింది పనిమనిషి. అనుకున్నటే అయింది. ఆమే! ఎంత నీరసంగా ఉందా ముఖం కళ్ళు వాడిపోయాయి. మూతలుపడి విశ్రాంతి తీసుకుంటున్నట్టున్నా యవి. ఇదివరకు నే చూసిన వాటికన్న ఎక్కువగా ఉన్నాయి నెరసిన వెండ్రుకలామె తలపైన. అలా పడుకున్న ఆమెను చూస్తే నాకు భయమేసింది. తేలిగ్గా ఆమె తల నిమురుతూ లేపింది దాసీది—"అమ్మా చిన్నబాబుగారొచ్చారమ్మా" అంటూ. విసుపన్నది లేకండా రోజూ సూర్యుణ్ణి చూడ్డంవల్లే బరువెక్కుంటూ యామె కళ్లు. ఎలా మూతలు పడ్డాయి. ఇంత వేగం అవి విడతాయా అనిపించింది. నా ఊహకి భిన్నంగా అవి తెరచుగున్నాయి. ఓర్మి, ఔదార్యం ఆ కళ్ళల్లో ఉట్టిపడుతున్నాయి. పరిశీలనగా చూశా యవి నన్ను. "చిన్న బాబుగారమ్మా" అంది దాసీది అమాంతంగా నన్నెత్తి మంచం మీద కుదేస్తూ. దానిమీద కోపమొచ్చి నా ఆలోచనకి వ్యవధిలేకపోయింది. సంతృప్తితో చూస్తున్నా యామె కళ్ళు. ఆమె పాలిపోయిన పెదాలమీద ఒక విచారపు చిరునవ్వు వెలిసింది. ఎందుకలా ఉందామె. సంజవేళ పడుకోక్కరాదనే అమ్మమాట జ్ఞాపకమొచ్చింది. జ్వరమొస్తేనే అలా పడుక్కుంటాను నేను—జ్వరమే ఒచ్చిందామెకి, ఆమెమీద జాలి వేసింది.

కప్పుకున్న దుప్పటిలోంచి వచ్చి నాపైన పడ్డా యామె చేతులు. నా శరీరాన్ని సున్నితంగా స్పృశించసాగా యవి. నా శరీరాన్నీ నా బుగ్గలనీ రాసిం దామె నవ్వుతూ. సున్నితంగా, మెత్తగా ఉన్నాయా వేళ్ళు. దాసీది జ్ఞప్తికివచ్చి నాలో అణగారిన కోపం రగులుకొంది. దగ్గరగా తీసుకున్నా యామె చేతులు నన్ను. మంత్రముగ్ధుడ్లా లొంగిపోయాను వాటికి. నన్ను ముద్దెట్టుకున్నా యామె నీరసించన పెదాలు, నాకు సిగ్గువెయ్యక పోలేదు. కాని ఆ కళ్ళలోని నమ్రత దాన్ని చెదరకొట్టింది. నేనక్కడికి వెళ్ళడానికి కారణం అప్పుడు గుర్తొచ్చింది. ఆమె రాకపోడానికి కారణం అడగాలి. మంచిసమయం. నాలుక కొసదాకా వచ్చింది. కాని అడగలేకపోయాను. ఆ స్థితిలో ఆమెకి నేను మరింత బాధ కలిగించినవాణ్ణవుతానేమో అనిపించింది. గుండెల కదుముకుందామె నన్ను. అమ్మ

జ్ఞానమొచ్చాక ఒక్కనాడన్నా నన్నలా తీసుకున్న పాపాన పోలేదు. ఒకసారి మెడపట్టుక వేళ్లాడితే "వెధవా గాడిదలా పదేళ్లు నెత్తికొచ్చినా" అంది. కాని ఈమె!

నిశ్చలమై ప్రశాంతమైన ఆమె ముఖం నన్ను వశపరచుకుంది. నా జుత్తులోకామె వేళ్ళు వెళ్లాయి. నా తల నిమిరిందామె. తృప్తిగా ఆమె కళ్లు మూతలుపడ్డాయి. ఒక్క నిముషం అలా సమాధిలో ఉంది. మా పుస్తకంలో వేసిన బోధిచెట్టుక్రిందున్న బుద్ధుడిపటం జ్ఞాపకమొచ్చింది. మూతలుపడ్డా అరమోడ్పుగానే కనుపించాయా కళ్లు. ఆమెకెప్పుడూ అరమోడ్పుకళ్ళే. విడ్డాయి తిరుగ అవి. చెమ్మగిల్లాయి వాటి రెప్పలు. కాని దూసుకపోయే సూర్యకిరణంతో మెరసే నీటిచుక్క లేదు. దగ్గరగా, ఇంకా దగ్గరగా తీసుకుందామెనన్ను. ఆమెకు లొంగిపోయాన్నేను. కాదు, ఆమె మనస్సుకు. ప్రేమదూపే ఆమె గుండెకి. నా కళ్ళు చెమ్మగిల్లాయి. కాదు నే నేడుస్తున్నాను.

ఇంటిముఖం పట్టేవరకు నాకీ ప్రపంచం జ్ఞాపకానికి రాలేదు. అమ్మ! నాన్న! ఇల్లు! ఆమె బాహువులలో ఎంతసేపు నిద్రపోయేను. ఎంత ప్రశాంతంగా గడిపానా క్షణాలు. ఆమె ప్రేమ నీడల్లో బ్రతుకంతా గడుపుతే ననిపించింది. పది గంటల రాత్రిలా వుంది. చాల చీకటిగా ఉంది. దాసీది వెంటవస్తోంది. పొమ్మని కసిరేను. కదల్లేదది· వెంట వస్తూనే ఉంది. ఆమె కళ్ళలో ఏదో బాధుంది. నే నన్నంతసేపూ సంతోషించింది. మళ్లా వెళ్తే— అమ్మో! ఏం చెయ్యడం ఇప్పుడు? ఇంటికెలా వెళ్లడం. కళ్ళల్లోనీళ్లుతిరిగాయినాకు. ఏం తప్పుచేశానని నన్నిలా కొడతారు అమ్మానాన్నా? ఆఖరుసారిగా గట్టిగా కసిరేను దాసీ దాన్ని. కాని మాయింటి గేటుదాటి లోపలికి వెళ్ళేవరకు అది నన్ను వదల్లేదు. మెట్లెక్కే ముందు నిలబడ్డానొక్క క్షణం. ఇంట్లోఎక్కడా చడిలేదు. అంతా పడుకున్నట్టున్నారు. వరండా మీద పడుక్కుంటే. బాగానే ఉంటుంది. తెల్లవారుజామున దెయ్యాలన్నీ ఇంటిముఖం పడతాయన్న అబ్బులుగాడి మాటలు జ్ఞాపకానికొచ్చాయి. ఈ వీధిగుండానే పోతాయని కూడా అన్నాడు, తురకల స్మశానం ఈ వీధి చివరనుంది కాబట్టి. నాలో ఉన్న ధైర్యం కాస్తాపోయింది. చడిచెయ్యకుండా మెట్లెక్కేను. ద్వారాన్ని సమీపించి చెవి తలుపు దగ్గరగా పెట్టి విన్నాను. ఏమి అలికిడిలేదు. తలుపు మెల్లగా తోశాను తీసుందేమో అన్న ఆశతో, బర్రుమంటూ తెరచుకుంది. నామీద నాకే కోపమొచ్చింది. బందుల్లో ఆముదం పొయ్యాలవి అనుకున్నాను. గది ప్రవేశించేను మెల్లగా అడుగులు వేసుకుంటూ. ఆ గదిలో నే పడుక్కోడానికి నిశ్చయించేను. అకస్మాత్తుగా ఏదోమీద పడింది గట్టిగా, అంతే. ఎవరో రెక్కపట్టుక ఈడ్చుకపోతున్నట్టనిపించింది. మరి నాకేమీ గుర్తులేదు. కళ్లు విప్పేసరికి నాన్నా అమ్మాదగ్గరగా కూర్చొనున్నారు. అంతా ఏమిటో వింతగా అనిపించింది. దీపం ఎర్రగా కాల్తోంది. కంది ఎర్రగా ఉంది నాన్న ముఖం. అమ్మకళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. నేను కళ్ళువిప్పాక స్టూలునుంచి లేచారు నాన్న. "వచ్చింది తెలివి. రాకేం చేస్తుంది? అలా చావలేకపోయాడూ వెధవ" అన్నారు పళ్ళుబిగించి, గోడవైపుతిరుగుతూ. ఏమిటో అర్థంకాలేదు నాకు, ఆలోచనకి బుర్రపరుగెత్తలేదు. "చస్తే చచ్చాడు వెధవ పోతే జైలుకిపోదును. ఇంకో మొత్తుమొత్తవలసింది. అప్రతిష్ఠతెచ్చినవెధవ" పిడుగులా గర్జిస్తున్నారు. "దొంగలా వచ్చి పడుక్కుందామనుకున్నాడు. నాదగ్గరా వీడిమాయలు" నారాకకోసం కిటికీగుండా చూస్తూకూర్చున్నారని నామీద బరువుగా పడినది. అతని పిడికిలేనని నాకప్పుడర్థమైంది. అతని నోరాగలేదు. "ఛీ! ఎంత అప్రతిష్ఠ. నలుగురిలో ఎంత నగుబాటు. దానికి డబ్బేఉండుగాక. ఊళ్లో తెలివితక్కువ వెధవలచేత పెద్దమనిషే అనిపించుకోనుగాక. నాకు మాత్రం అది ఎప్పుడూ రంకులంజే పైకి పెద్దమనిష నేవారేకాని లోన ఎవరికి మాత్రం తెలీదు. మదపిశాచి, చచ్చే కాలమొచ్చినా. ఛీ! ఛీ! నావల్లే ఆమెకీ మాటలన్నీ వస్తున్నాయని ఎంతో బాధపడ్డాను. నెళ్ళుండకపోతే బావుణ్ణనిపించింది. అమ్మఅడ్డొచ్చింది. "వాడిముందర ఈకబుర్లేమి"టంటూ, "అంటానా మరీ అంటానా, అందరి ముందూ అంటాను. మొగుడుచచ్చేక పెళ్లిచేసుకో కూడదూ. ఒక్కసారి ముఖంకాల్చి ఊరుకుందురు. ఇప్పుడురోజూ కాల్చినా సిగ్గుకూడా లేదు దానికి,

కన్నకొడుకుకూడా వదలిపోయేటంటే..." అతనలా ఎంతసేపు మాట్లాడారో నాకు గుర్తులేదు. ఏమిటి మాట్లాడారో అంతకన్నా వినలేదు. కలల ప్రపంచంలోనికి పోయేను నేను.

నా కాళ్ళకి బంధాలు పడ్డాయా మర్నాటి నుండీ సరిగా సమయానికి బడికివెళ్ళటం తిన్నగా ఇంటికి రావటం. ఇల్లే నా ఆటస్థలం అన్నీను. ఏమీ పనిలేపోతే అమ్మకి సాయం చెయ్యటం. ఆవిడింటి వైపు చూడనైనా కూడదని ఆజ్ఞ. కాని అమ్మవంట హడావిడిలో ఉన్నప్పుడూ, నాన్న ఇంట్లో లేనప్పుడూ దొంగతనంగా కిటికీని సమీపించి ఆత్రుతగా చూసేవాణ్ణి, ఆ ఇంటి ఆవరణలోకి. ఆవిడుండేది. అదే చూపు. నిశ్చలప్రశాంతమైన చూపు. ఆశ! నిరీక్షణ! దేనికోసం? ఏమో? కాని నా కొకటి తెలుసు. పూర్తయిన విశ్వాస మామె కుంది తనలో. రోజూ అస్తమిస్తున్న సూర్యుడితో మెరుస్తూ, ఆరుతూ ఉండేది, ఆమె కనుకొలకులలో నీటిచుక్క. ఎర్రటి కాంతిలో దివ్యంగా ఉండే దామె మూర్తి. నా చూపు లామె కళ్ళలో లీనమయేవి. నా ఆత్మ ఆమెతో ఏకీభవించింది. నే నామెలో ఒక్కడయ్యే వాణ్నొక్క క్షణం.

రోజులు గడువసాగాయి. వారాని కొకసారో రెండుసార్లో చూడ్డాని కవకాశం చిక్కేది. అప్పుడే నా మనస్సుకు శాంతి దొరికేది. అమ్మ ఆమెను సమీపించేందుకు కనుమతిస్తే బాగుణ్ణనిపించేది. అమ్మకి ప్రేమించడం తెలీదు. ప్రేమంటేనే తెలీదు. ఒక్కనాడు నాతో దయగా మాట్లాడి ఎరుగదు. నా కేడుపొచ్చేది.

నిద్రపోతున్న నాకు మెలకువ కలిగిం దొక రాత్రి. ఏవో శబ్దమయిన ట్టనిపించింది. గది నాలుగు మూలలూ పరికించి చూశాను. గదిలోని దీపం, చమురులేక కామోసు ఆరిపోయింది. అంతా చీకటి, ఇంటా బయట. అంతా నిశ్శబ్దం. ఎందుకు తెలివొచ్చిందో అవగాహన కాలేదు. దూరంగా మాత్రం వీధిచుక్కలు మెరుగుతున్నాయి. గది నాలుగు మూలలూ తిరిగి కలియచూశాను ఆ చీకట్లోనే. ఏ కారణమూ లేకుండా తెలివొచ్చిందేమో. తల పక్కకు తిప్పి కళ్ళు మూసాను. మగతగా నిద్ర పట్టింది. ఉలిక్కిపడి లేచాను. ఈసారి నేను పొరబడలేదు. ఆవిడింటినుంచే ఏవో కేకలు. చెవులిచ్చి విన్నాను. పురుషకంఠం. కొన్ని సెకండ్లు పోయాక వెక్కి వెక్కి ఏడుస్తూ స్త్రీకంఠం. ఆశ్చర్యం వేసింది. ఆమె ఇంటినుంచి ఏడుపు. తిరుగ బొంగురుగా పెద్ద కేకలు. ఎవరో ఆ కేక వేస్తున్నది. మంచం సద్దుచెయ్యకుండా దిగాను. చీకటిలో తడుముకుంటూ కిటికీని సమీపించేను. ఆత్రుతతో ఆమె ఇంటి ఆవరణలోకి చూసాను. చీకటయినా నక్షత్రాల కాంతిలో తెల్లగా కనబడుతోందా ఇల్లు. బయటేమీ అలికిడి లేదు. లోనుండి కఠోరంగా పురుషకంఠం. స్త్రీకంఠం నుండి జాలిగా ఏడుపూ వినవస్తున్నాయి. ఆశ్చర్యం ఎక్కువైంది నాలో. ఏడుస్తున్న దావిడే అందుకు సందేహంలేదు. ఎవరిదా బొంగురుగొంతుక కోపంతో కూడుకున్నట్టున్నాయా వచ్చే మాటలు. అదంతా ఒక వింతలా తోచింది. ఆవిడింటికి వెళ్ళాలి. ఎలా? సాధ్యమా? సాధ్యమైనా వెళ్ళి నే నేం చేస్తాను? ఏడుపు మానుతుందేమొ ఆమె నేను దగ్గరుంటే. ఆలోచించేను. అంతకంటే ఏమీ చెయ్యలేకపోయాను. కిటికీ ఊచలు పట్టుగొని వెర్రిగా చూస్తూ నిల్చున్నాను. అరగంట గడిచాక పెద్దశబ్దంతో ఆ ఇంటి తలుపు తెరచుకుంది. గదినుండి తెరవబడిన ద్వారంగుండా వచ్చే దీపపు కాంతిలో పొడుగాటి ఒక వ్యక్తి బయటకు రావటం చూశాను. పెద్ద అంగలు వేసుకుంటూ బూట్ల చప్పుడుతో చరచరా ఆవరణ దాటాడు. రోడ్డెక్కాక చీకట్లో కలిసిపోయాడు. కొంతసేపటిదాకా బూట్లచప్పుడు వినవచ్చింది. ఆఖరకలా అలా గాలిలో కలిసిపోయింది. ద్వారంగుండా ఆవరణలోకి పడే దీపపుకాంతిలో కూడా ఆమె ఏడుపు చీకటిని చీల్చుకొని వినవస్తూంది. ద్వారమలానే తెరచుకుంది. ఏడుపు తగ్గలేదొక ఘంట వరకు. ఆ చీకటిరాత్రి! ఆ నిశ్శబ్దం! దాన్ని చీల్చుకొనివచ్చే ఆమె ఏడుపు మరుపురాని స్మృతులుగా ఏర్పడ్డాయి నా మనస్సులో. చెమ్మగిల్లిన కళ్ళతో అలా చూస్తూ నిల్చున్నాను. ఏడుపు తగ్గింది కొంతసేపటికి. మరికొంతసేపటి కామెలో అంతరించింది. నా కళ్ళు మూతలు పడ్డాయి. నిద్రపోయేను ఆ ఊచలను పట్టుగొనే నాకు తెలియకుండా.

మర్నాడు లేచేసరికి బాగా తెల్లవారింది. ఎందుకో నా మనస్సు కలవరపడింది. అప్పుడు

జ్ఞప్తికి వచ్చింది రాత్రి జరిగిన సంఘటన. ఆశ్చర్యం నన్ను వదల్లేదు. సావిట్లోకి పరుగున వెళ్ళి ఆమె ఇంట్లోకి చూశాను ప్రశ్నార్థకంగా. రోజులాగే ఉన్నా ఆ ఇల్లు నాకు విచారంగా కనుపించింది. ఆవరణలోని పువ్వుల చెట్లు రక్తంలేని ముఖాలలా కనుపించాయి. ఆ ఇంటివేపు అడుగు వెయ్యడానికి భయమేసింది. స్కూలుకి వెళ్ళేను. తిరిగి వచ్చేను. రెండుసార్లా ఇంటిని చూసాను. వెళ్లాలని బుద్ధి పుట్టింది. కాని ఎందుకో, చీకటి, బూట్లచప్పుడు, ఏడుపు జ్ఞాపకమొచ్చి భయమేసింది. సాయంత్రాన ఆ ఇంటి ఆవరణలోకి చూశాను. ఆమె లేదు. నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నా మనస్సులో భయానికి తప్ప దేనికీ తావు లేపోయింది.

రోజులు గడుస్తున్నాయి. ఆమె ఆవరణలోకి రావడం మానేసింది. ఆ బొంగురుగొంతుక మాత్రం నన్ను వదల్లేదు. ప్రతినిముషం నా మనస్సులో ప్రతిధ్వనించసాగిందది. ఆ అర్ధరాత్రి ఆమెపట్ల అంత నిర్దయగా ప్రవర్తించిన వ్యక్తి ఎవడు? ఆ వ్యక్తికీ ఆమెకీ ఉన్న సంబంధం ఏమిటి? అతని ప్రవర్తనకీ ఆమె అసహాయపు ఏడుపుకీ కారణం? నాకేమీ తోచలేదు. ఎన్నో ఆలోచనలు నా మనస్సులో దొర్లేయి. ఏదీ సబబుగా తోచలేదు. ఆమెను సమీపించడానికీ ప్రశ్నించడానికీ సాహసం లేకపోయింది. ఆ ఇంటినిచూస్తే భయమేసేది.

ఒకనాడుదయం నిద్రలేచేసరికి అమ్మెందుకో హడావిడిగా తిరుగుతోంది సావిట్లోకి ఇంట్లోకీను. స్కూలుకి సెలవు. తెలివొచ్చినా మంచం దిగడానికి బద్ధకం వేసింది. కిటికీగుండా ఆకాశం ప్రశాంతంగా, నీలంగా, భీకరంగా కానొస్తోంది. ఎంతో తృప్తినిచ్చిందా ప్రొద్దు. లేవటానికి మనసొప్పలేదు. కళ్లు మూసుగున్నాను.

పొరుగింటావిడ వచ్చినట్లుంది. అంత ఉదయాన్నే ఏం మునిగిపోయిందనొచ్చేసింది. ఇద్దరూ ఏవో గుసగుస లాడుకుంటున్నారు. బద్ధకంగా లేచాను. నే రావటం కనిపెట్టి మాటలు కట్టిపెట్టారు వాళ్లిద్దరూ. అమ్మ నావేపు నవ్వుతూ చూసింది. అమ్మ నాతో ఇంత చనువుగా ప్రవర్తించడం నా ఎరుకలో చాలా తక్కువసార్లు. వింతనిపించింది నాకు. వేపపుల్లకోసం పెరట్లోకి వెళ్ళేను.

అమ్మ గొంతుక వినవచ్చింది.

"శని విరగడైపోయింది. లేకుంటే ఎంత అప్రతిష్ట, ఎంత ప్రతిష్ట."

"కాదుటమ్మా మరి, ఒక వీధంటూ ఉండి మర్యాదగా నాలుగు కుటుంబాలంటూ ఉన్నాక మధ్యని గచ్చపొట్టులాగ అప్రతిష్ట కాదుటమ్మా—" పొరుగింటావిడ గొంతుక ఏకీభవిస్తూ కొత్త విపుల పరచింది.

"దేముడంటూ ఒకడున్నాడు. ఏనాటికన్నా ఒక కన్ను వేసే ఉంచుతాడు" అమ్మ చాలించింది

వేపపుల్ల విరుచుకొని ఇల్లు ప్రవేశించగానే సంభాషణ ఆగింది.

అమ్మంది. "రామం పెరట్లో తోముకో ఈ వేళకి పళ్ళు" అని.

"వీధిలో చల్లటిగాలి వేస్తుందమ్మా" అన్నాను.

"పెరట్లోనూ వస్తోంది. వెళ్లు" అంది.

"ఏమే వీధిలో తోముకుంటే" అన్నాను.

"నాతో అనవుసరంగా వాదించకు. చెప్పిన మాట విను" అంది విసుగ్గా.

"ఏమే" అన్నాను జాలిగాచూస్తూ.

పొరుగింటావిడ నా సహాయానికి వచ్చింది.

"చిన్నపిల్లాడివి నాయనా నువ్వు. నీకు తెలీదు. మనింటి కెదురుగా ఒకావిణ్ణి దేవుడు తీసుకెళ్తున్నాడు. చిన్నపిల్లలు చూడకూడదు" అంది.

"ఏం దేముడు" అన్నాను అర్థంకాక.

"నీతో బలేచిక్కులాగే వుంది. నీకు దేనికది విడమర్చి చెప్పాల్లాఉంది. ఎదురుగుండా ఉన్న ఆ ముండ చచ్చింది. దాన్నెత్తుకుపోయాక నువ్వు వీధికొచ్చు." అంది అమ్మ పెద్ద గొంతుక చేసుకుంట్లో.

ఆతృత నాలో విజృంభించింది.

"ఎవరే" అన్నాను.

"పెరట్లోకి నడూ." అని ఒకటే ఒక ఆజ్ఞ అమ్మనుంచి.

దేనివల్ల ప్రేరేపింపబడ్డో నాకు తెలీదు. ఎందుకో, ఎలా ప్రవర్తించానో నాకు తెలీదు. వీధి

సమ్మ్రంలోకి పరుగెత్తివెళ్ళేను. ఆమె ఇల్లు నన్నాపిందొక్క నిముషం. ఇంటిముందర ఇరవైమందిలా ఉన్నారు. గడబిడగా లోనికీ, బైటకీ వెళ్తూవస్తున్నారు. ఒక్క పరుగులో ఆ ఇంటి ఆవరణ ప్రవేశించాను. ఏడుస్తూ పని మనిషి బయటకొచ్చింది. నన్ను చూసి బోరుబోరుమంది. "ఇంకేముంది అమ్మగారు మరి మనకి లేరు చిన్నబాబుగారూ" అంటూ.

నాకు స్పృహ లేదు. అందర్నీ తోసుకుంటూ లోనికి వెళ్ళేను. పని మనిషి నావెనకనే వచ్చింది. ఆమెగది ఆమెమంచం కళ్ళకు కట్టినట్టే ఉన్నాయి. అక్కడున్న వాళ్ళందర్నీ తోసుక లోనికి పోయేను. ఆమె గది ఆనాటిరాత్రిలాగనే అందంగా ఉంది. ఆమె మంచం చెక్కు చెదర్లేదు. శుభ్రంగా పరిచున్న దుప్పటి. ఆ రాత్రిలానే సుఖంనిండా కప్పుగొనుందామె. నా కాళ్ళబంధాలు విడ్డాయామెఉనికిని స్మరించగానే. పరుగెత్తివెళ్ళి ఆమె ఒడిలో వాలేను. అంతే ఏమి జరిగిందో నాకు గుర్తులేదు. తెలివొచ్చేసరికి ఆమె చుట్టూ నలుగురైదుగురే ఉన్నారు. పని మనిషి నామీద చెయ్యివేసి కూర్చుంది. ఆమెలో చలనంలేదు. ఆనాటిలా ఆమె చేతులు దుప్పటి కప్పులోంచి నన్ను దగ్గరగా తీసుకునేందుకు రాలేదు. ప్రశాంతమైన ఆమె చూపులే దుప్పటి ముఖాన్న కప్పేసుందికనుక, ముఖానున్న కప్పు తొలగించేందుకు చేతిని జాచాను. వెనుక నుండెవరో పట్టుకున్నారు గట్టిగా.

"తప్పు" అని మందలించిదొక బొంగురు గొంతుక.

ఎవరిదో అని చూసేందుకు కూడా శక్తిలేక పోయింది. తిరుగ ఆమె ఒంట్లో వాలేను.

"ఈ ఊరికే తీరని నష్టం. ప్రాచీనభావాలు, సాంప్రదాయాలు జీర్ణించుకున్న ఈ ఊరుకి ఇప్పటి నవీనప్రపంచంలో పడేందుకు ఒక విప్లవానికి దారి తీసిన వ్యక్తామె. ఆమె మన మధ్యనుండే భాగ్యం మనకు లేదు." అన్నదొక పురుషకంఠం కీచిగా.

"నాకొక స్నేహితురాలు పోయింది. నాలో ఎన్నోవింత భావాలు రేకెత్తించిందామె" అందింకొక పురుషకంఠం జాలిగా.

"నాకొక దగ్గర బంధువు పోయినట్లుంది. మా ఇద్దరికీ పరిచయమై చాల తక్కువ కాలమైనా మా భావాలు హృదయాలు ఏకీభవించాయి. మా ఇద్దరి మనస్తత్వాలూ ఒకటే" అంటూ సంతాపాన్ని వెలిబుచ్చిందింకొక కంఠం.

చాలా విచారంగా అందొక గొంతుక వణుకుతూ దుఃఖంవల్ల.

"ఔను. నాకూ ఆమెకూ అంత చెప్పుకోదగ్గ పరిచయముండేది కాదు. కాని ఒకనాడంతట ఏదో పనుండి ఆమె మా స్కూలుకి రావటం తటస్థించింది మాటల సందర్భాన మా ఇద్దరి భావాలు ఒకేవిషయం మీద ఏకీభవించాయి. ఆమె నన్ను ఆ ఆదివారం నాడు రాత్రి ఇంటికి విందుకు రమ్మంది. నాకోసమే ప్రత్యేకంగా ఏర్పరచింది. వద్దన్నా వినలేదు. విందు పూర్తయేసరికి నడిరాత్రి దాటింది. చాల చీకటిగా ఉంది. ఇంటికి పోయేందుకు తయారుపడ్డాను. "మీకేం మతిపోయిందా. ఈ చీకట్లో ఎలా వెళతారు. పైగా చాల రాత్రయిపోయింది. ఇక్కడ పడుక్కొని రేపుదయం వెళ్ళండి. మీకోసం అన్నీ ఏర్పాటు చేయించేను. కాదంటే మరి లాభంలేదు" అని బలవంతం చేసిందావిడ. అది మా పరిచయానికి మొదటి మెట్టు. ఎంత మర్యాద ఎంత పెద్దమనిషి తరహా" దుఃఖం ఆ కంఠాన్నింపింది.

"కాఫీ తాగొస్తే బావుణ్ణు. పదండి వెళ్ళి పది నిమిషాల్లో ఒచ్చేద్దాం" అని ఆజ్ఞాపించింది మొదటి కంఠం. మెల్లిగా గది వదలి వెళ్లారంతా. పనిమనిషి లేచి సావిట్లోకి వెళ్లింది. నేనూ ఆమే గదిలో. ప్రశాంతంగా, నిశ్శబ్దంగా ఉంది గది. ఆమె ఒడిలోంచి లేచాను. ఆమె ముఖం చూడాలని గట్టిగా కోరిక పుట్టింది. కాని జంకు కలిగింది. చల్లటిగాలి వీస్తోంది కిటికీగుండా. ఆకాశం ఉదయమంత నీలంగా లేదు. కొంచెం బూడిదరంగొచ్చింది దానికి. నా మెదడు ఖాళీగా ఉంది. ఖాళీగానే కిటికీగుండా శూన్యంలోకి చూసేను. ఐదునిముషాలు గడిచాయి. నాకళ్లు చెమ్మగిల్లాయి.

రెపరెప చప్పుడు నా మనసు నాకర్షించింది. కిటికీకెదురుగా ఉన్న టేబిలుమీదున్న ఒక నోటు పుస్తకపు పేజీల నెగరవేస్తోంది తన బలంతో గాలి. చేత్తో తిప్పినట్టు పేజీలు తిరుగుతున్నాయి. అకస్మాత్తుగా అందు నుండొక చిన్న ఫోటో గాలి కెగిరి

నేలపడింది. వెళ్లి ఆతృతకొద్దీ దాన్ని తీసిచూశాను. పదిహేనేళ్ల వయస్సులో నున్న ఒక కుర్రాడిఫొటో. ముఖం అందంగా ఉంది. కళ్లనుండి చూపులు పదునుగా ఉన్నాయి. నుదుటిమీద పెద్ద మచ్చ. ఫొటో వెనకభాగం తిప్పాను. 'గోపాల్' అని పెద్దక్షరాల్తో రాసుంది. అన్ని ఫొటోల్లాగే వుంది. అందులో ప్రత్యేకత మరేమీ నాకు కనిపించలేదు. ఆ పుస్తకంలో ఆ ఫొటో ఉండడానికి కారణమేమిటో అని అనుమానం పుట్టింది. పుస్తకాన్ని తీశాను. బాగా నలిగిన డైరీ పుస్తకం అది. పేజీలు తిరగేశాను. అస్పష్టంగా పెన్సిలుతో రాసుంది, అక్కడక్కడ. ఒకచోటుంది - "నీకోసం రోజూ ఎదురుచూస్తాను." మరొకచోట - "నాతప్పులుంటే క్షమించి రావూ" అని. ఏవేవో అస్పష్టంగా రానున్నాయి. ఆఖరు పుట తిప్పాను. సిరాతో రాసుంది. ఆతృతగా చదివాను.

"గోపాలం—నా తండ్రీ—మనం మానవులం అలానే ఉండగలం మనం. ఏడు రజోగుణాలు ప్రతి ఒక్కరిలోను ఉంటాయి. అందుకే మానవులమయాం మనం. లేకపోతే దేవతలమే. వాటినుండి విముక్తి సాధ్యంకాదు తండ్రీ. వాటికి లొంగిపోయేం మనం. కాబట్టి అందులో ఏ గుణానికి లొంగినా అది మానవ నైజం.

ఈ ఇల్లు వదిలినాడు నువ్వు నా కుడికంటిమీద కొట్టినదెబ్బ తియ్యని స్మృతిగా రోజూ తలచుగుంటూంటాను. నువ్వు నన్ను వదలిన నాటినుంచీ ప్రతిదినం నీ రాకకోసం ఎదురుచూస్తున్నాను.

రావూ గోపాలం! ఏ ఆశా లేకండా అంతరించిపోయే నా హృదయానికి మెరుపువి కావూ?

నువ్విల్లు వదలడానికి నేనే కారణమన్నావు. కామంతో కాలే మంటనన్నావు. నిజమే. వాటి నన్నింటికీ తలవంచుతున్నాను నీ పాదాలముందు. నన్ను తల్లిగా చూడు. తల్లిగా అర్థంచేసుగో. కళంక రహితంగా వెలిగే తల్లిప్రేమకి నీ హృదయంలో చోటు నియ్యి. రావూ గోపాల్."

అట్టమీద రాసుంది పెన్సిలుతో—

"నా నిరీక్షణ ఫలించింది. నువ్వు వచ్చావు. అంతే నాకు చాలు. కొట్టినా తిట్టినా నేను బాధపడలేదు. అవి నాకు ఆనందాన్నిచ్చాయి. కాని ఆ అర్థరాత్రే నన్ను వదిలావు. నేనింక బ్రతకలేను. ఇది నా జీవితంలో ఆఖరిఘట్టం"

పుస్తకం నాచేతినుండి జారింది. ఆమె మంచం వైపు చూశాను. ప్రశాంతంగా అక్కడే ఉందామె. ఆమెను సమీపించాను. రెండు చేతులతోను ఆమె ముఖాన్ని కప్పున్నదుప్పటి తొలగించాను. నాలోని భయం ఏనాడో పోయింది. ఆ ముఖం నాకాశ్చర్యం కలిగించింది. జీవం ఉట్టిపడుతోందా ముఖంలో. కళకళలాడుతూ ఎంత ప్రశాంతంగా ఎంత గంభీరంగా ఉందా ముఖం! వంగి ఆమె నుదుటిని ముద్దు పెట్టుకున్నాను. సూర్యుడు మీదకొచ్చాడు. బంగారు తీవలా అతని ఒక కిరణం ఆమె ముఖంమీద పడింది. ఒక్కసారి వెనక్కు తగ్గాను. రోజూ ఆమె కళ్లల్లో అస్తమించే కిరణం ఈవేళ ఉదయించింది. లేత బంగారుకాంతిలో దూసుకుపోతోంది, ఆమె కుడి కనుకొలకులోకి. మణిలా మెరసింది "నీటిచుక్క" ఆ కంటికొలకులో.